

లోకేష్ దృష్టికి సచివాలయ ఉద్యోగుల సమస్యలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ఆధ్వర్యాన అమరావతి సచివాలయంలో ఐటి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌శాఖ మంత్రి నారా లోకేష్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై లోకేష్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నూతన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, కలెక్టరేట్ ఉద్యోగులు స్వాగతం పలికారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆయన్ను కలెక్టరేట్ ఛాంబరులోకి ఆహ్వానించి ఆశీర్వచనం అందజేశారు. తన కుటుంబసభ్యుల సమక్షంలో కలెక్టర్ సంతకం చేసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం పలు శాఖల అధికారులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘ సహాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, కార్యదర్శి బి.వి.వి.ఎన్ రాజు, ఉపాధ్యక్షులు మురళీధర్ నాయక్, జాయింట్ సెక్రటరీలు బి.శ్రీనివాసరావు, రామలింగం తదితరులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తొలుత ఆయన కుటుంబ సభ్యులతో కలిసి అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతించారు. స్వామి వారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివెట్టి మండపంలో ఆయనకు శేషవస్త్రాన్ని కప్పి చిత్రపటాన్ని అందజేశారు.

బంద్ సక్సెస్

- నీట్, నెట్ పరీక్ష లీకేజీపై నిరసనాగ్రహం
- జిల్లావ్యాప్తంగా మూతపడిన విద్యాసంస్థలు
- పలుచోట్ల ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నీట్, నెట్ పరీక్ష లీకేజీకి నిరసనగా విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు గురువారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ జిల్లాలో విజయవంతమైంది. ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలు మూతపడ్డాయి. బంద్ నేపథ్యంలో పలు ప్రయివేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించాయి. బంద్ సందర్భంగా జిల్లాలో పలుచోట్ల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. శ్రీకాకుళం, పలాస, టెక్కలి, నరసన్నపేట, పొందూరు తదితర ప్రాంతాల్లో బంద్ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని, విద్యార్థులకు న్యాయం చేయాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.



టెక్కలి : ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

పలు ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలను సందర్శించి బంద్ పాటించాల్సిందిగా విద్యార్థి సంఘాలు చేసిన విజ్ఞప్తికి యాజమాన్యాలు స్పందించి సెలవు ప్రకటించాయి.

శ్రీకాకుళం నగరంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పలు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి డి.చంద్, బి.హరీష్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో నీట్ విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని స్పష్టం చేశారు. జిల్లాలో అటు ఇచ్ఛాపురం నుంచి రణస్థలం వరకు అన్ని విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయని చెప్పారు. విద్యార్థుల్లో ఉన్న ఆగ్రహాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్షల అవకతవకలకు కారణమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దని హితవు పలికారు. బంద్‌కు సహకరించిన విద్యాసంస్థలకు కళాశాల యాజమాన్యాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నీట్ నిరసన ర్యాలీలో విద్యార్థులు పాల్గొని తమ ఆగ్రహాన్ని వెలిబుచ్చుతుంటే రాష్ట్రంలో ఉన్న అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు ఏమీ పట్టడం లేదని విమర్శించారు. నీట్ సమస్యపై నిక్కచ్చిగా పోరాడుతోంది ఎస్ఎఫ్ఐ మాత్రమేనని చెప్పారు. నీట్ పరీక్షలో విద్యార్థులకు న్యాయం జరగకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పవిత్ర, రాణి, భరణి, కుసుమ, మోహిని, నితిన్, బి రాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పలాస : విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపులో భాగంగా పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఎఐఎస్ఎఫ్, ఆధ్వర్యాన చేపట్టిన బంద్ విజయవంతమైంది. ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. కాశీబుగ్గ ఉన్నత పాఠశాల, పలాస హైస్కూల్, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలను విద్యార్థి సంఘ నాయకులు మూయించారు. పలాస జూనియర్ కళాశాల నుంచి ఇందిరా గాంధీ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎన్.దివ్య, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రవి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి : బంద్‌లో భాగంగా పలు ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు మూతపడ్డాయి. నీట్ పరీక్షను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.చందు, ఉర్జాన దుర్గాప్రసాద్, తరుణ్, మహేష్, బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం : పాఠశాలను మూసివేయించడంతో బయటకు వస్తున్న విద్యార్థులు



పలాస : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు

ఫ్రింజ్ లేబొరేటరీలో ప్రమాదం

ముగ్గురు కార్మికులకు గాయాలు



కార్మికులను పరామర్శిస్తున్న అమ్మన్నాయుడు

ప్రజాశక్తి - రణస్థలం

మండలంలోని పిషినిలో గల ఫ్రింజ్ లేబొరేటరీస్ ఫార్మా పరిశ్రమలో గురువారం పేలుడు సంభవించింది. పరిశ్రమ ఆవరణలో డ్రమ్ము యార్డు వద్ద ఉన్న తినైల్ క్లోరైడ్ డ్రమ్ పేలడంతో, అందులోని రసాయనాలు తుళ్ళి కార్మికులు కె.గోవిందరావు, పి.త్రినాథరావు, పి.శ్రీనుకు గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటనా విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు పరిశ్రమకు వెళ్లి గాయాలపాలైన కార్మికులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమ యాజమాన్యాలు సరైన భద్రతా చర్యలు తీసుకోవాలని, కార్మికుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పరిశ్రమ యాజమాన్యాలు సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో ఈ వారంలోనే పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో సరాకా పరిశ్రమలో రసాయన డ్రమ్ములు, రియాక్టర్లు పేలిపోవడంతో భారీ ప్రమాదం సంభవించిందని గుర్తుచేశారు. ఈనెల రెండో తేదీన శ్రేయాస్ ఫార్మా పరిశ్రమలో సంభవించిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు చనిపోయారని తెలిపారు. ఇప్పటికైనా పరిశ్రమలు భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు.

పోరాట యోధుడు 'అల్లూరి'

ఎమ్మెల్యే గొండు శంకర్



అల్లూరి చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న జెసి నవీన్, ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పోరాట యోధుడు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అల్లూరి 127వ జయంతిని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో అల్లూరి సీతారామరాజు పోరాటం ప్రత్యేక అధ్యాయమన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటితరానికి ఆదర్శమన్నారు. భారతదేశ చరిత్రలో మహోజ్వల శక్తిగా, గిరిజనుల హక్కుల రక్షణ కోసం ఉద్యమించిన అల్లూరి నేటితరానికి స్ఫూర్తిదాయకమన్నారు. 27 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఢీకొన్నారని చెప్పారు. మన్యం వాసుల కష్టాలను కడతేర్చడానికి తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాడారని చెప్పారు. డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, కెఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ దొరబాబు, డిఎస్ఒ శాంతిశ్రీ, బిసి సంక్షేమ అధికారి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జీవితం ఆదర్శప్రాయం

అల్లూరి సీతారామరాజు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. నగరంలో జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల పాలిట అల్లూరి సింహస్వప్నంగా నిలిచారన్నారు. గిరిజనుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఎఒ సిహెచ్.గోపీనాథ్, సిఐలు దేవుళ్లు, శ్రీనివాస్, ఆర్ఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఎస్‌పి రాధిక

కలెక్టర్‌గా మధుర జ్ఞాపకం

మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం జిల్లాలో పనిచేయడం తన జీవితంలో ఒక మధుర జ్ఞాపకంగా ఉంటుందని బదిలీపై వెళ్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. తన కెరీర్‌లో ఒక్కసారి అయినా జిల్లా ఎన్నికల అధికారిగా పనిచేసి సమర్థవంతంగా, ప్రశాంతంగా నిర్వహించాలనే కల ఇక్కడ నెరవేరడం ఎంతో సంతృప్తినిచ్చిందని చెప్పారు. నగరంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో రెవెన్యూ అసోసియేషన్, జిల్లా అధికారులు గురువారం సాయంత్రం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జిల్లాలో ఈ ఏడాది జరిగిన సాధారణ ఎన్నికలు తనకి ఎప్పటికీ గుర్తుంటాయన్నారు. ప్రజలకు సేవలు అందించడం ఒక అనుభూతి అని, జిల్లా స్థాయిలో చేపట్టిన పనులు గ్రామస్థాయిలో ఎలా అమలవుతున్నాయో తెలుసుకోవడానికి సంపూర్ణ పర్యవేక్షణ అవసరమని అన్నారు. ఈ ఐదు నెలల కాలంలో అనేక కార్యక్రమాలు నిర్వహించే అవకాశం లభించిందని, ప్రజలు, అధికారులు సహకారం మరువలేనిదని పేర్కొన్నారు



గజమాలతో సన్మానిస్తున్న జిల్లా అధికారులు

నిరాడంబరతకు మారుపేరు : జెసి

నిరాడంబరతకు మారుపేరు బదిలీపై వెళ్లిన కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అని, ఉన్నత స్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బందితో సైతం ఎటువంటి బేషజాలు లేకుండా మాట్లాడేవారని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2న కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన అందరినీ కలుపుకొని ఎన్నో ప్రభుత్వ కార్యక్రమాలు, సాధారణ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించారని అన్నారు. ఆయన దగ్గర చాలా ముఖ్య అంశాలు తెలుసుకున్నానని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు మాట్లాడుతూ పనిపూర్తి స్థాయిలో నేర్చుకోవడానికి వీరి దగ్గర పనిచేయడం చాలా అవసరం అన్నారు. ఎన్నికల నిర్వహణే కాదు అన్ని కార్యక్రమాల్లో ముందుండి పూర్తి స్థాయిలో పని జరుగేలా చర్యలు చేయట్టడం వారి శైలి అని కొనియాడారు. టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ సువ్వుతూ ఎంత పనైనా సమర్థవంతంగా నిర్వహించి, పనిలో అందరికీ సలహాలు సూచనలు అందజేశారని కొనియాడారు. విస్తృత పర్యటనలతో, జిల్లాపై సమగ్ర అవగాహన ఏర్పరుచుకున్నారని, ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలైన ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛను పంపిణీ సకాలంలో ప్రజలకు చేరువ చేశారని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, పలాస ఆర్‌డిఒలు సిహెచ్.రంగయ్య, భరత్ నాయక్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, డ్వామా పీడీ చిట్టిరాజు, డిఎంహెచ్ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, డిఎస్ఒ శాంతిశ్రీ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనురాధ, ఎల్డిఎం హరిప్రసాద్ పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

జాయింట్ కలెక్టర్ నవీన్



రక్తదానం చేస్తున్న జాయింట్ కలెక్టర్ నవీన్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని జాయింట్ కలెక్టర్ బి.నవీన్ యువతకు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో కన్వీనర్ ఎల్.సుధాకరరావు ఆధ్వర్యాన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన వారందరూ రక్తదానానికి ముందుకు రావాలన్నారు. జిల్లాలో అవసరాలకు తగ్గట్లుగా రక్తనిల్వలు లేవని చెప్పారు. దీంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం లభించడం లేదన్నారు. రక్తదానం చేయడం ద్వారా మరికొందరి ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు. జిల్లాలో త్వరలో పెద్దఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ రక్త నిధిలో పూర్తిగా రక్తం లేదని, ఇటువంటి సమయంలో ఈ సంస్థలో 75 మంది రక్తదానానికి ముందుకు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి జాయింట్ కలెక్టర్ ప్రశంసాపత్రాను అందించారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కళాశాల ప్రాంగణంలోని స్వామి వివేకానంద విగ్రహానికి ఆయన వర్ధంతి సందర్భంగా పూలమాల వేసి నివాళ్లర్పించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్యామ్‌కుమార్, ఎంపిడిఒ రామ్మోహన్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, ట్రైనింగ్ ఆఫీసర్లు కామేశ్వరరావు, విద్యాసాగర్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ జి.దినేష్, సుజాత, జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం అంధకారం

ప్రజాశక్తి - లావేరు

మాదకద్రవ్యాలతో జీవితం అంధకారమవుతుందని జిల్లా ఉపాధికల్పన అధికారి కె.సుధ అన్నారు. మండలంలోని బుడుమూరు జెడ్‌పి పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ - మాదకద్రవ్యాల అనర్థాలపై గురువారం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిస కాకూడదన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. చదువుకునే వయసులో విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మానవ మనుగడ పర్యావరణంతో ముడిపడి ఉందన్నారు. పర్యావరణ సమతుల్యతకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం, వాటిని సంరక్షించాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ సంచులను ఉపయోగించకుండా గోనె సంచులను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో వికలాంగులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కవిత, సెట్‌శ్రీ సిఇఒ బి.ప్రసాదరావు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూజారి గోవిందరావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి సుధ

పక్కా భవనాలకు ప్రతిపాదనలు

ఐసిడిఎస్ ఆర్‌జెడి చిన్మయిదేవి

ప్రజాశక్తి- టెక్కలి

సమగ్ర స్త్రీ, శిసు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఉన్న రీజనల్ పరిధిలో సేవలందిస్తున్న అంగన్వాడీ శాశ్వత భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని రీజనల్ జాయింట్ డైరెక్టర్ డి.చిన్మయిదేవి తెలిపారు. టెక్కలి ఐసిడిఎస్ కార్యాలయాన్ని గురువారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఐసిడిఎస్ కార్యాలయ పనితీరుపై పిఒ పి.శోభారాణితో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలో 7,659 అంగన్వాడీలకు శాశ్వత భవనాలు ఉన్నాయని అన్నారు. మొదటి విడతగా 712 భవనాలు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.12 లక్షలు అవసరమని గుర్తించామన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 6,120 అద్దె భవనాల్లో నడుస్తున్నాయని చెప్పారు. వీటిలో 484 కమ్యూనిటీ భవనాల్లోను, 650 పాఠశాల భవనాల్లోను, 482 సొంత భవనాల్లో సేవలందిస్తున్నామని అన్నారు. గ్రామీణ, పట్టణాల్లోని అంగన్వాడీ సిబ్బంది లబ్ధిదారులతో మమేకమై స్నేహపూర్వక వాతావరణం మధ్య విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాలింతల్లోను, పుట్టే శిశువుల్లో పౌష్టికాహారం లోపం లేకుండా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. చిరుధాన్యాల వినియోగం గురించి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్లు లక్ష్మి, జలజాక్షి, శారద పాల్గొన్నారు.




రికార్డులను పరిశీలిస్తున్న చిన్మయిదేవి

సంక్షేమ హాస్టళ్ల సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ఎపి ఎన్‌జిఒ హోంలో బిసి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల అసోసియేషన్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా గురువులు, వైకుంఠరావు, కోశాధికారిగా శివప్రసాద్, సహాధ్యక్షునిగా ఎన్.ఉపేంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్.మోహనరావు, ఉపాధ్యక్షునిగా ఎస్.రామకష్ణ, బి.మీనాక్షి, జాయింట్ సెక్రటరీగా జె.రమేష్‌బాబు, లక్ష్మణరావులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎఒ గోవిందపట్నాయక్, సహాయక ఎన్నికల అధికారిగా సిపిఒ కార్యాలయ సీనియర్ సహాయకులు బి.పూర్ణచంద్రరావులు వ్యవహరించారు.

తహశీల్దార్ చలమయ్య మృతి

మెళియాపుట్టి, నౌపడ : మండలంలో నందవకొత్తూరుకు చెందిన జె.చలమయ్య (55) సబ్బవరం తహశీల్దార్‌గా పనిచేస్తూ... గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన సంతబొమ్మాళి తహశీల్దార్‌గా పనిచేసి... సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సబ్బవరం బదిలీ అయ్యారు. కొన్ని రోజులుగా అనారోగానికి గురికావడంతో సెలవు పెట్టి పాతపట్నంలో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. వైద్య పరీక్షలు చేయించుకున్నా నయం కాలేదు. ఈయనకు భార్య ఉన్నారు. ఆమె ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఈయనకు కుమారు, కుమార్తె ఉన్నారు. ఈయన మృతితో అధికారులు, గిరిజన సంఘ నాయకులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.



చలమయ్య (ఫైల్)



పరిశ్రమ ఎమ్‌డితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

ఫ్రింజ్ పరిశ్రమ పరిశీలన

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలం పిసిని వద్ద ఉన్న ఫ్రింజ్ పరిశ్రమలో గురువారం స్వల్ప ప్రమాదం జరిగిందని సమాచారం అందుకున్న వెంటనే ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తక్షణమే స్పందించి పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. ప్లాంట్ ఆవరణలో ఉన్న తేనయెల్ క్లోరైడ్ డ్రమ్ ఆకస్మికంగా మండి పేలడంతో దట్టమైన పొగ వచ్చిందని పరిశ్రమ ప్రొడక్షన్ ఇన్‌ఛార్జి రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సంఘటన వద్ద కొలగాన గోవింద, పి.శ్రీను, పి. త్రినాథ్‌లు పనిచేస్తుండగా వారిలో గోవిందకు గాయాలు కావడంతో విజయనగరం ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిశ్రమ ఎండి భాస్కర్‌తో ఫోన్‌లో మాట్లాడి భద్రతా చర్యలు తీసుకుని బాధితునికి మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేతో పాటు కూటమి నాయకులు పిసిని జగన్నాథం నాయుడు, పిన్నింటి భానోజీనాయుడు, లెంక శ్యాం, ఆకుల రవి, లెంక నారాయణరావు, అప్పలనాయుడు, శ్రీను, బస్వ రమణరెడ్డి తదితరులున్నారు.



పుష్పగుచ్ఛం అందిస్తున్న శాంతిస్వరూప్‌రెడ్డి

నౌపడ పంచాయతీ అభివృద్ధికి చర్యలు

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీ పరిధిలోని సీతానగరం, కుర్మానాథపురం, జగన్నాథపురం, నౌపడ గ్రామాల శాశ్వత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు సిగ్గు శాంతిస్వరూప్‌రెడ్డి కోరారు. ఈ మేరకు విజయవాడ కరెన్సీ నగర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును గురువారం వినతిపత్రం అందజేశారు. ముందుగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నౌపడ పంచాయతీలో భూగర్భ డ్రెయినేజ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, స్వచ్ఛమైన వంశధార తాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. యువతకు నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. మార్కెట్ సముదాయం, సిసి రోడ్లు, ప్రధాన రహదారి అభివృద్ధి, కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా గోదాములు ఏర్పాటు చేయాలని కోరారు.

అందరికీ 'అల్లూరి' ఆదర్శం



శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న కుమార్ రాజా



ఎచ్చెర్ల : నివాళ్లర్పిస్తున్న ఆచారి, యువకులు, విద్యార్థులు



లావేరు : సీతారామరాజు చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి కె.ఆర్.రజని మాట్లాడుతూ చిరు వయసులోనే మరణించినా తన ధైర్య సాహసాలతో శతాబ్దాల ఖ్యాతిని పొందిన అల్లూరి సీతారామరాజు అందరికీ ఆదర్శం కావాలన్నారు. నిరక్షరాస్యతతో, పేదరికాన్ని అనుభవిస్తున్న గిరిజనుల సహకారంతో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధమైన మహా మనీషి అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. కార్యక్రమంలో ఆచార్య బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, ఒఎస్‌డి. డా. కావ్య జ్యోత్స్న, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.అనురాధ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.సిహెచ్. రాజశేఖర్, వర్సిటీ సాంస్కృతిక వ్యవహారాల సమన్వయకర్త డాక్టర్ కె.ఉదయ్ కిరణ్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలం ధర్మవరంలో అల్లూరి జయంతిని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎల్ఐసి ఉద్యోగి టేకి ఆచారి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పాలిశెట్టి సురేష్, డి శంకర్, వై.నందీశ్వరరావు, పి.వెంకట రమణ, బి.జగదీష్, కె.ప్రకాష్, బి.నగేష్, ఎం.కిరణ్, ఎం.సురేష్‌తో పాటు యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా కుశలాపురంలో అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో సీతారామరాజు విగ్రహాన్ని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అక్షయ సేవాసమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

లావేరు: బుడుమురు జెడ్‌పి పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు పూజారి గోవిందరావు ఆధ్వర్యంలో అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.కె. ప్రసాదరావు, తమ్మినాయుడు, ఎం.అనురాధ, వెంకటరావు, రమేష్‌బాబు, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని పిఎన్ కాలనీ జంక్షన్ వద్ద అల్లూరి విగ్రహానికి దంతులూరి రమేష్ బాబు పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జలుమూరు రాము, శ్రీను, రవి, సంతోష్, ఏసు, సూరి, తిరుపతి, శేఖర్, నాని, బుగిలి, చిన్న పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అల్లూరి చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, రిటైర్డ్ గ్రంథాలయాధికారులు ఎస్‌వి రమణమూర్తి, జి.గోవిందరావు, గ్రంథాలయ సిబ్బంది పి.వరలక్ష్మి, యు.కళ్యాణి, పి.రామ్మోహన్, మానస పాల్గొన్నారు.

సమాచార శాఖలో

జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో డిపిఆర్ఒ కె.చెన్నకేశవరావు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్, డివిజనల్ పిఆర్ఒ ఎన్.రాజు పాల్గొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి కార్యాలయంలో డిఎంహెచ్ఒ డాక్టర్ బి.మీనాక్షి, డాక్టర్ సిపి శ్రీదేవి, డాక్టర్ వెంకటరావు, డాక్టర్ ప్రవీణ్ నివాళ్లర్పించారు.

ఆమదాలవలస: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. విస్తరణాధికారి డి.గోవిందరావు, సీనియర్ సహాయకులు ఎన్.కిరణ్ కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పురపాలక సంఘంలో అల్లూరి చిత్రపటానికి ఎఇ బి.శృజన నివాళ్లర్పించారు. టిపిఎస్ హెచ్. వి.సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.రామారావు, ఐ.సాయిరాం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలాస : ఆర్‌డిఒ కార్యాలయంలో సీతారామరాజు చిత్రపటానికి ఆర్‌డిఒ భరత్ నాయక్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కార్యాలయం ఎఒ జె.సూర్యనారాయణ, పైల వెంకటేశ్వరరావు, కరుణ, సంతోష్ పాల్గొన్నారు. అలాగే తహశీల్దార్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి తహశీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడు, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ మెట్ట మైకుంఠరావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. డిటి లక్ష్మీనారాయణ, ఆర్ఐ నిరంజన్, రాజేష్, ఎఒ అనురాధ పాల్గొన్నారు.

కవిటి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, ఇఒ వీరభద్రస్వామి, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ వినోద్, పిఎస్ ఖాన్ అబ్దుల్ పాల్గొన్నారు. ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కవిటిలోని కళ్యాణి ఆంగ్ల పాఠశాల, కవిటి కొత్తూరు బివికె పాఠశాలల్లో అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం మురళీప్రకాష్, ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, ఎం.అప్పలనరసమ్మ, రవి, ఎల్ మురళి, కళ్యాణి ఆంగ్ల పాఠశాల హెచ్ఎం బిందుమాధవి, ఎఒ ఎం.రాణి, బివికె ప్రధానోపాధ్యాయుడు ఎం.అనిల్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: తహశీల్దార్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి తహశీల్దార్ ఎం.సురేష్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ పవిత్ర, విఆర్ఒలు పాల్గొన్నారు.

పాతపట్నం : తహశీల్దార్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి తహశీల్దార్ వై.ఎస్.వి.వి. ప్రసాదరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

నందిగాం : తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వి.పద్మావతి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ టి.రాజారావులు సీతారామరాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలో ఇన్నీసుపేటలో జనసేన రాష్ట్ర సెక్రటరీ తిప్పాన దుర్యోధనరెడ్డి, దుంగ భాస్కర, రొకళ్ల భాస్కర్‌లు సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. తహశీల్దార్ కార్యాలయంలో డిటి శ్రీహరి, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమేష్, ఐసిడిఎస్ ప్రాజెక్టులో పిఒ నాగరాణి, వెలుగు కార్యాలయంలో ఎపిఎం ఎం.ప్రసాదరావులు అల్లూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

సోంపేట: సీతారామరాజు జయంతి, స్వామి వివేకానందని వర్ధంతిని జిల్లా రోటరీ రీజినల్ పబ్లిక్ ఇమేజ్ చైర్మన్ డాక్టర్ దుద్ది శ్రీనివాసరావు ఆధ్వర్యాన స్థానిక రోటరీ క్లబ్ సభ్యులు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని శ్రీశయన వీధికి చెందిన ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందిన పిట్ట ఢిల్లేశ్వరరావు కుమారుడు దీరజ్ చదువుకునేందుకు దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏడో తరగతికి కావాల్సిన పుస్తకాలు, ఇతర విద్యా పరికరాలు, రూ.పది వేలు నగదు ఆర్థికం అందజేశారు. అలాగే పలాసపురానికి చెందిన వికలాంగురాలు బెందాళం జయమ్మకు కృత్రిమ కాలును గురుదేవ్ ఛారిటబుల్ ట్రస్టు కన్వీనర్ అప్పలస్వామి సహకారంతో శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు కె.రవికుమార్, శ్యామ్, పురుషోత్తం, చిరంజీవి, వజ్జ మృత్యుంజయలు పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. నాయకులు పేడాడ త్రివేణీరావు, గడ్డాయ్ భాస్కర్, నాగ, అశోక్ పాల్గొన్నారు.



ఎచ్చెర్ల : మాట్లాడుతున్న బిఆర్ఎయు విసి రజని



ఆమదాలవలస : నివాళ్లర్పిస్తున్న ఎంపిడిఒ వాసుదేవరావు



ఇచ్ఛాపురం: విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న జనసేన నాయకులు



సోంపేట : నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

'ఐతమ్' అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్



రామకృష్ణ

టెక్కలి ఆది ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న బొందల రామకృష్ణకు విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్లో పిహెచ్‌డి పట్టాను మంజూరు చేసిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎయు యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.వెంకట సుబ్బయ్య మార్గదర్శకత్వంలో 'పాత్ ప్లానింగ్ ఆఫ్ మొబైల్ రోబోట్ ఇన్‌ఫిక్స్ అబ్బాకిల్స్ ఎన్విరాన్మెంటల్ యూజింగ్ పార్టికల్ స్వార్మ్ ఆప్టిమైజేషన్' అనే అంశంపై డాక్టర్ బి.రామకృష్ణ చేసిన పరిశోధనకు ఈ పిహెచ్ డిగ్రీని ఎయు జారీ చేసిందన్నారు. డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాసరావు, ఆరెస్డా డీన్ డాక్టర్ డి.శ్రీరాములు, మెకానికల్ హెచ్ఎడి డాక్టర్ పి.క్షహరి, అధ్యాపకు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ

టెక్కలి రూరల్ : టెక్కలి మేజరు పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ గొండేల సుజాత అధ్యక్షత గురువారం గ్రామసభ నిర్వహించారు. పలు అంశాలు, సమస్యల పరిష్కారం ఇతర అంశాలపై సమీక్షించారు. పలువురు అధికారులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడం గమనార్హం. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బి.మల్లేశ్వరరావు ఎంఇఒ-2 చిన్నవాడు, వార్డు మెంబరు బమ్మిడి గురువునాయడు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజేష్ ఔదార్యం

కవిటి: జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి లోల్ల రాజేష్ తన ఔదార్యం చాటుకున్నారు. నెలవంకకు చెందిన దుర్గాశి శ్యామలకు చెందిన 13 మేకలు సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మృతి చెందాయి. ఈ విషయం తెలుసుకున్న రాజేష్ గురువారం నెలవంక చేరుకుని బాధితురాలితో మాట్లాడారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని చెప్పి బియ్యం బస్తా, నిత్యావసర సరుకులు అందజేశారు.

పిల్లలు బడిలో ఉండాలి

ఇచ్ఛాపురం : బడిఈడు పిల్లలో బడిలో ఉండాలని ఈదుపురం జెడ్‌పిహెచ్‌ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం భాస్కర్‌పాడి అన్నారు. ఈ మేరకు ఈదుపురం, ఒడియా కంద్రా వార్డులో గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్ పాడి, ఎస్ఎంసి చైర్మన్ గౌరోహరి బెహరా పాల్గొన్నారు.

హరిప్రసాద్‌ను కలిసిన రాజు

ఇచ్ఛాపురం : సీనియర్ జర్నలిస్టు పిడుగు హరిప్రసాద్ జనసేన ప్రారంభం నుంచి పార్టీలో ఉండడంతో ఆ పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రకటించారు. ఈ మేరకు ఆయన నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా అమరావతిలో ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు గురువారం ఆయనను కలిసి అభినందించారు.

8న బహిరంగ వేలం

కోటబొమ్మాళి: ఈ నెల 8న మధాహ్నం 3 గంటలకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సీజ్ చేసిన 21.970 కిలోల పిడిఎస్ బియ్యాన్ని బహిరంగ వేలం పాట వేస్తున్నామని తహశీల్దార్ లత్సాపాత్రుడు ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది మే నెల 15న మండలంలోని చీపుర్లపాడు పంచాయతీ దుర్గంపేట గ్రామ ఆవరణలోని శ్రీవసంత లక్ష్మి మోడరన్ రైస్ మిల్లు గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 21.970 కిలలో పిడిఎస్‌ను బియ్యాన్ని శ్రీకాకుళం విజిలెన్సు అధికారులు, కోటబొమ్మాళి రెవెన్యూ అధికారులు పట్టుకొని సీజ్ చేశారని అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వాటిని వేలం వేస్తున్నట్టు తెలిపారు. ఆసక్తిగల వారు పాల్గొవాలని సూచించారు.

పాస్టర్‌కు సన్మానం

పలాస: స్థానిక పాస్టర్ చింతకాయల కిరణ్ కుమార్‌కు జిల్లా క్రైస్తవులు, కాపరులు, పరిచర్యల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన గౌరవ బిషప్ బిరుదుతో బుధవారం సత్కరించారు. బిషప్ గంజి ఆర్ ఎజ్రా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కె.అబ్రహం, బిషప్ సూరాడ, డేనియల్, బిషప్ రాజ్‌కుమార్, బిషప్ యేసుపాదం, న్యాయ సలహాదారులు అనిల్‌రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కంచిలి: మండలంలోని కేబినౌగం, పోలేరు, డిజిపురం, కేసరిపడ, ముండల సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎఇ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

117 జిఒను రద్దు చేయాలి

నందిగాం: పాఠశాలల్లో సమస్యల సేకరణలో భాగంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల లండ బాబూరావు, బాలక శంకరరావులు మండలంలోని తెంబూరు, నౌగాం, పెద్దతామరాపల్లి, నర్సిపురం, లఖిదాసపురం పాఠశాలలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 117 జిఒను రద్దు చేసి పాఠశాలల విలీన ప్రక్రియను ఆపాలని ప్రభుత్వానికి కోరారు. రోలుతో సంబంధంలేకుండా ప్రధానోపాధ్యాయులను, ఫిజికల్ డైరెక్టర్లలను కొనసాగించాలని విన్నవించారు. అనంతరం ఎంఇఒను కలిసి ఉపాధ్యాయ సంఘాల కో-ఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని అన్నారు. విద్యార్థులకు కిట్లు పంపిణీకి ఇచ్చిన పారితోషికం ఆయా ప్రధానోపాధ్యాయులకు ఇవ్వాలని కోరారు. ఈయన వెంట మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు కుమారస్వామి, గణపతిరావు, అప్పలస్వామి, చిన్నవాడు ఉన్నారు.

ఐదుగురు గురుకుల విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

తోటపాలెంలోని దుప్పలవలస డా బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల కళాశాలలో ఐదుగురు విద్యార్థులకు గడిచిన మూడు రోజులుగా కడుపు నొప్పితో అస్వస్థత గురయ్యారు. పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 600 మందికి పైగా చదువుతున్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో సాయంత్రం వేళల్లో కొందరు విద్యార్థులు కొంతదూర సమీపంలో ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు వెళ్లి నూడిల్స్, పానీపూరి, చాట్, బజ్జీలు, పకోడీ, కూల్ డ్రింక్‌లకు అలవాటు పడ్డారు. అటువంటి తినుబండారాలు తినడంతో గత మూడు రోజుల నుంచి కడుపునొప్పితో బాధపడుతూ ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులు వైద్యులకు సమాచారం ఇవ్వడంతో విద్యార్థులను పరీక్షించి స్కానింగ్ కోసం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులకు అపండి సైట్స్‌గా గుర్తించి కార్తీక్, కె.కార్తీక్, జితేంద్రలకు సర్జరీ చేశారు. మరో ఇద్దరు విద్యార్థులకు పాఠశాలలోనే చికిత్స నిర్వహించారు. ప్రస్తుతం కడుపు నొప్పికి గురైన విద్యార్థులు పాఠశాలలో క్షేమంగానే ఉన్నారని, ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రధానాచార్యులు చిట్టి రాజు తెలిపారు. జిల్లా వైద్యాధికారి బొడ్డేపల్లి మీనాక్షి, పొన్నాడ పిహెచ్‌సి వైద్యులు ఎన్. శేషగిరిరావు, పి.సౌమ్యశ్రీలు పాఠశాలను గురువారం సందర్శించి వసతి గృహాన్ని పరిశీలించి ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎఫ్ఒ జగన్నాథం, సూపరెంటిండెంట్ డేవిడ్, పిహెచ్ఎస్ సుధా తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మీనాక్షి

ఓంకార్ మృతి ఉద్దానానికి తీరని లోటు



ఓంకార్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పలాస

ఓంకార్ మాస్టర్ మృతి ఉద్దాన ప్రాంతానికి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని నీలావతిలో ఉన్న గ్రంథాలయం ఆవరణలో ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యాన గురువారం ఓంకార్ మాస్టర్ సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఓంకార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఓంకార్ మాస్టర్ ఆశయాలను కొనసాగించాలన్నారు. ఉద్దాన ప్రాంత సమస్యలను తన సమస్యలుగా భావించి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఉపాధ్యాయుడుగా వృత్తిలో పనిచేస్తూ ఉపాధ్యాయ సమస్యల పోరాటంలో కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక అధ్యక్షుడు బొమ్మాళి శివ, ప్రధాన కార్యదర్శి గొరకల లోకేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు కుత్తుం ప్రకాశరావు, కాశీబుగ్గ వైద్యులు తెప్పల ఆనందరావు, లక్ష్మీప్రసన్న, ఎపి జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, ఎంపిటిసి మాజీ సభ్యులు పోతనపల్లి గీతమ్మ, బోనెల గోపాల్, పుచ్చ దుర్యోధన, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, తాండ్ర ప్రకాష్, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ, ప్రజా కవులు నిశితాసి వంకల రాజారావు, కుత్తుం వినోద్‌కుమార్, పిడిఎఫ్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్‌కుమార్, యువివి పూర్వ అధ్యక్షులు ఇసాకోటి జోగారావు, కుత్తుం సుధాకర్, బొడ్డు సుధాకర్, దుమ్ము శంకర్, శశిధర్ వర్మ, తెప్పల వాసు, పాలిన కృష్ణారావు, యుటిఎఫ్ అధ్యక్షుడు కంచరాన రమేష్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు, బొడ్డపాడు సర్పంచ్ తామడ మదన్, బొడ్డు వాసుదేవరావు, కుమార్‌నాయక్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు అవగాహన


ప్రజాశక్తి- పోలాకి

కౌలు రైతు తన కాయకష్టాన్ని నమ్ముకొని వ్యవసాయం ఆధారపడి ఉంటారని, వారికి ప్రభుత్వం అని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని మబగాంలో కౌలు రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్డులు పొందిన కౌలు రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎడిఎ రవీంద్రభారతి, ఎఒ చిరంజీవి, డిటి పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని చిన్నతామరపల్లి, పెద్ద తామరపల్లి గ్రామాల్లో మండల ఎఒ శ్రీకాంత్‌శర్మ కౌలు రైతులకు అవగాహన కల్పించారు. కౌలు రైతులు కార్డు పొంది ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు టి.నరసింహులు, టి.సింహాద్రినాయుడు, టి.మహేష్ పాల్గొన్నారు.

సోంపేట : సాగుదారు హక్కుపత్రాల కోసం, భూమి కౌలుకు చేస్తున్న రైతులు అవసరమైన పత్రాలతో రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని మండల ఎఒ నరసింహమూర్తి సూచించారు. మండలంలోని సుంకిడి, ఎంజిపురం, మాకన్నపురం గ్రామాల్లో కౌలు రైతులకు అవగాహన కల్పించారు. కార్యరకమంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది యోగేశ్వరరావు, ఈశ్వరరావు, జీవన్రావు, శ్రీకాంత్, భార్గవి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని బిర్లంగిలో మండల ఎఒ భార్గవి కౌలు రైతులకు అవగాహన కల్పించారు.




పోలాకి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సమరయోధుల స్మృతివనం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

భావితరాలకు స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో పాటు దేశభక్తిని పెంపొందించేందుకు నగరంలో రూపుదిద్దుకున్న గాంధీ మందిరం సమరయోధుల స్మృతివనం చారిత్రాత్మకమైనదని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గాంధీ మందిరంలో నూతన జాతీయ జెండాను 105 అడుగుల ఎత్తులో ఆయన గురువారం ఆవిష్కరించారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుతో పాటు జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా గాంధీ మందిరం 40 మంది స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తలతో పాటు 105 అడుగుల ఎత్తులో జాతీయ జెండా నెలకొల్పి సిక్కోలు ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన నిర్వాహకులతో పాటు సహకరించిన దాతలను అభినందించారు. గాంధీ మందిరం అభివృద్ధికి తనవంతు సహకరిస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో సురంగి మోహనరావు, నటుకుల మోహన్, బరాటం లక్ష్మణరావు, వావిలపల్లి జగన్నాథం నాయుడు, డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, బాడాన దేవభూషణ్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్



సంఘటనా స్థలంలో దిలీప్ కుమార్ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని జక్కర జాతీయ రహదారి వద్ద గురువారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన పోరిడా దిలీప్‌కుమార్ (40) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరు నుంచి ఒడిశా ఛత్రపురం ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. జక్కర వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. అతివేగంతో వచ్చిన మృతుడు బైక్‌ను అదుపు చేయలేక ఢీకొనడంతో తలకు తీవ్రగాయమై ప్రమాదస్థలంలోనే మృతి చెందారు. బైక్ వెనక కూర్చున్న హరిహర పోరిడకు గాయాలయ్యాయి. ఆయనను బరంపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రసాద్

కొత్తూరు: ఆర్‌అండ్‌బి ఖాను తెరిపించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక అలికాం - బత్తిలి ఎబి ప్రధాన రహదారిపై నాలుగేళ్లుగా మురుగునీరు నిలిచి పోయిందన్నారు. పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా గత పాలకులు, అధికారులు స్పందించలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన రహదారిపై మురుగునీరు చేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. స్థానిక నివాసవాసులు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు.

అక్రమ నిర్మాణాలు పరిశీలన

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మెగిలిపాడు సర్వే నంబరు 246-3లోని చెరువు పోరంబోకులో ఆక్రమంగా నిర్మాణం చేపట్టిన భవనాన్ని తహశీల్దార్ ఎస్ఎస్‌విఎస్ నాయుడు గురువారం పరిశీలించారు. అక్రమ భవన నిర్మాణంపై మీ సేవలో వచ్చిన ఫిర్యాదుపై ఆయన స్పందించారు. ఈ మేరకు మెగిలిపాడు చెరువు పోరంబోకులో నిర్మించిన భవనాన్ని పరిశీలించి ఇది అక్రమ నిర్మాణంగా గుర్తించారు. ఈయనతో పాటు మండల సర్వేయర్ నిరంజన్, ఆర్ఐ గిరి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వేలం పాట పూర్తి



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

టెక్కలి రూరల్: టెక్కలిలోని గోపాల జగన్నాథస్వామి ఆలయ భూములు కౌలు బహిరంగ వేలం గురువారం ప్రశాంతంగా ముగిసింది. దేవస్థానం సంబంధించిన సర్వే నంబర్లు 9,10,12,19,28,437లోని ఎ 15-32 సెంట్లు మెట్టు భూమిని కౌలు హక్కులు పొందే ందుకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ పాటలో మొత్తం 9 మంది పాటదారులు పాల్గొన్నారు. ముడుదాన ఆనందరావు, ముడుదాన రాంప్రసాద్, జిలీలాప్రసాద్‌లు కౌలు హక్కు దక్కించు కున్నారు. ఆలయ ఇఒ టి.పి.మనస్వీ, వాకచర్ల రాధాకృష్ణ, దేవాదాయశాఖ అధికారి జి.ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

ప్రాథమికోన్నత పాఠశాల సందర్శన

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలం రణస్థలం ప్రాథమికోన్నత పాఠశాలను స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. కూటమి సభ్యులతో పాఠశాలలో అన్ని తరగతులు కలియతిరిగి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాలలో సమస్యలను సర్పంచ్ భానోజీ నాయడు, ఇన్‌ఛార్జి హెచ్ఎం సనపల సరళ ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం అసంపూర్తిగా ఉన్న సచివాలయం, వెల్నెస్ కేంద్రాన్ని పరిశీలించారు.

అరసవల్లిని దర్శించుకున్న సంపూర్ణేష్ బాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయాన్ని గురువారం సినీనటుడు సంపూర్ణేష్ బాబు సందర్శించారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ఆయనకు ఆలయ జూనియర్ సహాయకులు చక్రవర్తి చిత్రపటాన్ని అందజేశారు.



అవగాహన కల్పిస్తున్న డేవిడ్ ఫలోన్

విదేశీ విద్య సాకారం సులభం

గ్లోబల్ ఓవర్‌సీస్ డైరెక్టర్ డేవిడ్ ఫలోన్

ప్రజాశక్తి- నరసన్నపేట

విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం సరైన మార్గదర్శనంతో సులభమవుతుందని లియో గ్లోబల్ ఓవర్ సీస్ డైరెక్టర్ డేవిడ్ ఫలోన్ తెలిపారు. ఈ ప్రక్రియలో కీలక అంశాలను గుర్తిస్తే కోరుకున్న యూనివర్సిటీలో విద్యను అభ్యసించవచ్చన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో 'ఓవర్సీస్ ఎడ్యుకేషన్'పై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఔత్సాహిక విద్యార్థులకు తమ సంస్థ పూర్తి సహాయ, సహకారాలు అందిస్తుందని తెలిపారు. డిగ్రీ పూర్తిచేసిన చాలామంది విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలని కోరుకుంటారని, సరైన గైడ్‌లైన్స్ లేక ఆగిపోతున్నారని పేర్కొన్నారు. పరీక్షలు, వీసా, భాష తదితర విషయాల్లో అవగాహన లేక ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. విద్యార్థులు ప్రధానంగా రెజ్యూమె, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, లెటర్ ఆఫ్ రికమండేషన్‌పై దృష్టి సారించాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉంటుందన్నారు. ఇందుకోసం పేరున్న యూనివర్సిటీని ఎన్నుకోవాలని దానికి ముందస్తు ప్రణాళిక, సంసిద్ధత అవసరమని తెలిపారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ మాకేనా సతీష్, సంస్థ ప్రతినిధులు వాసవి కొనా, రాజేంద్ర పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అధికారులు

లబ్బ ఆశ్రమ పాఠశాల తనిఖీ

కొత్తూరు : మండలంలోని లబ్బ గిరిజన ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ డిప్యూటీ డైరెక్టర్ అన్న దొర, డిప్యూటీ ఇఒ నారాయుడు, ఎఎంఒ పొట్నూరు కోటిబాబు, సిఎంఒ చిరంజీవులు, జిసిడిఒ రాములమ్మలు గురువారం తనిఖీ చేశారు. తరగతి, వంట గదులు, వాటర్ ప్లాంట్‌లను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. వైద్యులతో తరచూ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పాఠశాలలో ప్రవేశాలు పెంచాలని ప్రధానోపాధ్యాయులు జె.కె.విశ్వనాథ్‌ంకు ఆదేశించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ఆమదాలవలస: మండలం కొర్లకోటలో జిల్లా టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి సనపర ఢిల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టారు. గురువారం గ్రామంలోని సూర అప్పారావు ఇంటి వద్ద నుంచి ఆర్అండ్‌బి మెయిన్ రోడ్డు వరకు ఉన్న సిసి కాలువలోని చెత్తను తొలగించి రహదారిపై ఉన్న ఆక్రమణలను గుర్తించి జెసిబి సహాయంతో తొలగించారు. అలాగే గ్రామంలో సిసి కాలువల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు నిధులు మంజూరు చేయడంతో పారిశుధ్య కార్యక్రమాల వారోత్సవాల్లో భాగంగా పారిశుధ్య నిర్వహణను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు, టిడిపి సీనియర్ నాయకులు పేడాడ గురువు నాయుడు, గొండు రవి, వార్డు మెంబర్ పాత్రుని మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కొత్త కార్యవర్గంపై కసరత్తు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చింది. ఇచ్ఛాపురంలో మూడోసారి ఎమ్మెల్యేగా బెందాళం అశోక్ విజయం సాధించారు. రానున్న రోజుల్లో టిడిపిను మరింత పటిష్టంగా ఉండాలంటే పాతతరానికి పక్కనపెట్టి కొత్తతరానికి పార్టీ బాధ్యతలు అప్పగించే పనిలో పార్టీ అధినాయకత్వం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సీనియర్లకు పార్టీ నాయకత్వానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చే పెద్దన్న బాధ్యత అప్పగిస్తే మేలు అని పార్టీ ముఖ్య నేతలు భావిస్తున్నారు. అందులో భాగంగానే ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో ఎప్పుడూ కార్యవర్గంలో మనస్పర్థలు ఉంటున్నాయి. అందుకే ఇచ్ఛాపురం అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తున్నా... మున్సిపాలిటీకి వచ్చేసరికి ఓటమి పాలవుతుంది. ఈసారి మున్సిపాలిటీలోనూ టిడిపి జెండా ఎగురవేయాలన్న గట్టి పట్టుదలతో అశోక్ పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీని సమిష్టిగా ముందుకు తీసుకెళ్లగలిగే నాయకత్వానికి పార్టీ పగ్గాలు ఇవ్వాలని ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం ఉన్న కార్యవర్గం స్థానంలో కొత్త కార్యవర్గంలో ఎవ్వరికీ ఏ స్థానంలో ఉంచాలో పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక ఇంటికీ ఒక పదవి నినాదం కూడా పార్టీలో కొంతమంది నేతలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు భోగట్టా.

ఎప్పటి నుంచో పట్టణ పార్టీని ప్రక్షాళన చేయాల్సి ఉన్నా... ఎన్నికల దృష్ట్యా పాత కార్య వర్గాన్నే కొనసాగించుకుని వచ్చారు. ఈ సారి మార్పు తప్పనిసరని తెలుస్తోంది. పార్టీ ఇంకా ఐదేళ్లు అధికారంలో ఉంటుంది, పార్టీ నిర్ణయాన్ని ఎవ్వరూ దిక్కరించే పరిస్థితి ఉండదని భావిస్తున్నారు.

ఎమ్మెల్యే గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఆనేక మంది టిడిపిలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని నాయకులు చెబుతున్నారు. పార్టీలో నాయ కుడు పనితీరుపై ఒక్కరికీ ఒకచోట స్థానం కల్పించి వారి గౌరవానికి భంగం కలగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటామని పార్టీ కేడర్ భావిస్తుంది. నామి నేటెడ్ పదవులూ ఇదే కోవలో కష్టపడిన ప్రతి కార్యకర్తకూ కచ్చితంగా గుర్తింపు ఉంటుందని నేతలు అభిప్రాయపడుతున్నారు.



సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని డోల గ్రామంలో టిడిపి నాయకులు డోల జగన్ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి గురువారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. గ్రామస్తులు, అభిమానులు ఆనందంతో మంగళవాయిద్యాలు నడుమ బాణసంచా కాల్చుతూ ఊరేగించారు. కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, లుకలాపు రాంబాబు, గొండు రామన్న, భైరి భాస్కరరావు, సూరపు నారాయణదాసు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జైజయం ఫోటో జర్నలిస్టు కొంక్యాన శివశంకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలోని గొంటివీధిలో పట్టణ పేదల నిర్మూలన వ్యవస్థ నైట్ షెల్టర్‌లో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు శాశపు జోగినాయుడు హాజరై కేకు కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కొంక్యాన మురళీధర్‌తో పాటు జీల్ ఫౌండేషన్ సాయి, నంది ఉమా శంకర్ పాల్గొన్నారు.

వంగవీటి రంగా అందరివాడు

ప్రజాశక్తి- లావేరు

దివంగత నేత, విజయవాడ మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా అందరి వాడని టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ అన్నారు. రంగా 77వ జయంతి సందర్భంగా మండల కేంద్రం లావేరులో రంగా కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోహన రంగా బడుగు, బలహీన, హరిజన, గిరిజన ప్రజానీకాన్ని ఎంతగానో ప్రేమించే వారన్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి విజయవాడకు వలస వెళ్లిన ప్రజలను ఎంతగానో ఆదరించి, వారికి వెన్నుదన్నుగా వుండే వారన్నారు. ఆయన అసాయసాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, పైడి శ్రీనువాసరావు, కునపల్లి దామోదరరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

ఆడపిల్లల సంరక్షణపై దృష్టి

ఇచ్ఛాపురం: ఆడపిల్లల సంరక్షణపై ప్రత్యేక దృష్టాసారించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నారు. కెజిబివిలో ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యాన సంకల్ప వంద రోజులపై గురువారం నిర్వహించిన అవగాహనా సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడ పిల్లలను తల్లిదండ్రులు చదవించాలన్నారు. బాల్యవివాహాలను ప్రోత్సాహించ రాదన్నారు. గుడ్ టచ్ బాడ్ టచ్ కోసం ఆడపిల్లలకు బాల్యంలోనే పాఠశాలల్లో, ఇళ్లల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ భారతిదివ్య, పిఒ నాగారాణి, నీలపు లక్ష్మి, సూపర్‌వైజర్ సుజాత, కెజిబివి ప్రిన్సిపాల్ పొన్నాడ శిరీష, కొండ శంకర్, నందిగాం కోటి, రెయ్య సత్యవతి, గిన్ని వెంకట రమణ, సుభాష్ రౌలో, భాస్కర్ పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌పై దాడి చేయలేదు

టిడిపి పట్టణ కార్యదర్శి నవీన్‌కుమార్



మాట్లాడుతున్న నవీన్‌కుమార్

ప్రజాశక్తి- పలాస

మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుపై తాను దాడి చేయలేదని, కార్యకర్తల నుంచి రక్షించారని పట్టణ టిడిపి కార్యదర్శి నవీన్‌కుమార్ తెలిపారు. రెండు రోజులుగా మున్సిపల్ చైర్మన్‌పై దాడి చేశానంటూ పత్రికల్లో వస్తున్న కథనాలపై ఆయన ఖండించారు. ఈ సందర్భంగా మున్సిపాల్టీలోని పురుషోత్తపురంలోని యువకులతో, మహిళలతో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 1న 24 వార్డులో ఎన్‌టిఆర్ భరోసా పింఛను పంపిణీ చేశారని, పేరిట ప్రభుత్వం పింఛన్ల పంపిణీ చేపట్టిందని, ఈ క్రమంలో 24వ వార్డులో సర్వర్ పనిచేయకపోవడంతో ఒక్కరోజులో పింఛన్లు పంపిణీ చేయాలనే ఉద్దేశంతో కలుగుజేసుకున్నానని తెలిపారు. ఇంతలో మున్సిపల్ చైర్మన్ చేరుకుని తనను, సచివాలయ సిబ్బందిపై దుర్భాషలాడుతూ విరుచుకుపడ్డారని ఆరోపించారు. ఇంతలో బాధితులంతా ఒక్కసారిగా అక్కడకు చేరుకున్నారని, వారు ఆగ్రహంతో రావడంతో చైర్మన్‌పై దాడి జరుగుతుందని ఊహించానన్నారు. ఇంతలో చైర్మన్‌ను, ఆయన సోదరుడిని రక్షించేందుకు తాపత్రయపడ్డానే తప్ప.. ఆయనపై దాడి చేసిన సందర్భం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దడియాల నరసింహ, కొరికాన వైకుంఠరావు పాల్గొన్నారు.

వైస్ ఛాన్సలర్ రాజీనామా చేయాలి



నిరసన తెలియజేస్తున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

తెలుగు నాడు విద్యార్థి సమైక్య(టిఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు, విజయనగరం, శ్రీకాకుళం పార్లమెంట్ అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు గురువారం ఎచ్చెర్ల డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వ విద్యాలయాన్ని సందర్శించి వర్సిటీ వైస్ ఛాన్సలర్ కె.ఆర్.రజిని, రిజిస్ట్రార్ పి.సుజాత అవినీతి ఆరోపణలను పరిగణలోకి తీసుకోవాలని, సోమవరం జరిగిన నియామకాల్లో ఎటువంటి పాలకమండలి ప్రణాళికలు లేకుండా, రాత, మౌకిక పరీక్షలు నిర్వహించకుండా 21 మందిని ఒప్పంద సహాయ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయడం, యూనివర్సిటీ నిధులు పక్కదారి పట్టడం, నాలుగేళ్లలో పాలక మండలికి వ్యతిరేకంగా జరిగిన నియామకాలు, నిధుల సడలింపుపై శాంతియుత నిరసన తెలియజేశారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు మజ్జి రామ్మూర్తి, విజయనగరం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి బెవర భరత్, శ్రీకాకుళం పార్లమెంట్ అధ్యక్షులు ప్రహర్ష నితిన్, రూప కుమార్, చక్రి తదితరులు పాల్గొన్నారు.

పేదరికం విద్యకు అడ్డు కారాదు



ఆర్థికసాయాన్ని అందజేస్తున్న శోభారాణి

శ్రీకాకుళం అర్బన్: పేదరికం విద్యకు అడ్డుకారాదని, విద్యతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని లయన్స్ క్లబ్ ఆఫ్ హర్షవల్లి జోనల్ చైర్మన్ కరణం శోభారాణి అన్నారు. నగరంలోని గాంధీనగర్‌లో ఉన్న లయన్స్ క్లబ్ ఆఫ్ హర్షవల్లి కార్యాలయంలో నగరానికి చెందిన సిహెచ్ భార్గవి ఉన్నత చదువుకు రూ.20వేలు ఆర్థికసాయాన్ని గురువారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్మీడియట్ 92 శాతం మార్కులు సాధించి, ఎంసెట్‌లో 36 వేల ర్యాంకు సాధించిందని తెలిపారు. నగరంలోని ఓ ప్రయివేటు కాలేజీలో భార్గవి ఇంటర్ విద్యను పూర్తి చేసిందని, ఫీజు చెల్లించలేదంటూ కళాశాల యాజమాన్యం ఆమెకు సంబంధించిన ధ్రువపత్రాలను ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. పేదరికం కారణంగా మంచి ప్రతిభ కలిగిన విద్యార్థిని చదువు మధ్యలోనే నిలిచిపోకూడదనే ఆలోచనతో ఆర్థికసాయం అందజేసినట్లు వివరించారు. క్లబ్ జిల్లా చైర్మన్ కె.ఎస్.ఎస్.వి ప్రసాద్ (హారికా ప్రసాద్) మాట్లాడుతూ అధైర్యపడవద్దని ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్‌లో ఉన్నతంగా స్థిరపడాలని విద్యార్థినికి సూచించారు. భవిష్యత్‌లో ఏ అవసరం ఉన్నా సహాయం అందజేస్తామన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హర్షవల్లి క్లబ్ మెంబర్ నిహార్ చందక పాల్గొన్నారు.

సాగుహక్కు గుర్తింపు కార్డులు పొందాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మోహనరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

కౌలు రైతులు తప్పనిసరిగా పంట సాగుహక్కు పత్రానికి దరఖాస్తు చేసుకుని గుర్తింపు కార్డులను పొందాలని ఎఒ మెట్ట మోహనరావు అన్నారు. గురువారం మండలంలోని కలివరంలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు హక్కు గుర్తింపు కార్డులు పొందిన రైతులకు పంట నష్టపరిహారం, పంటల భీమా, అన్నదాత సుఖీభవ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు తదితర పథకాలను ప్రభుత్వం నుంచి అందించడం జరుగుతుందన్నారు. భూసార పరీక్షల ఫలితాలపై క్షుణ్ణంగా రైతులకు వివరించారు. ఎరువులను ఏ మోతాదులో, ఏ సమయంలో ఎలా వినియోగించాలో రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటలో వెదలో చేపట్టాల్సిన కలుపు యాజమాన్యం వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బండి రాజులు, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఎస్.అశోక్, విఆర్ఒ అనుపమ, రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మోటారు ఇంజిన్లు మంజూరు చేయాలి

కొత్తూరు : రైతులకు మోటారు ఇంజిన్లు, స్ప్రేయర్లు, టార్పాలిన్లు రాయితీపై అందజేయాలని నేరడి పంచాయతీ జోగిపాడుకు చెందిన రైతులు కోరారు. ఈ మేరకు ఎంపిడిఒ త్రివిక్రమరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వాటర్‌షెడ్ పథకం కింద టార్పాలిన్లకు 31 మంది, స్ప్రేయర్లకు నలుగురు, నీటి ఇంజిన్లకు ఇద్దరు రూ.23,050 బ్యాంకులో డిడి తీశామని అన్నారు. ఇప్పటికీ వరకు వాటిని అందజేయలేదని ఎంపిడిఒకు విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు వి.శ్రీను, ఎం.ఇందిర, కె.పార్వతి, సిహెచ్.రాము, ఎ.కృష్ణ, ఉమాదేవి ఉన్నారు.

ఆక్రమణలు నిరూపిస్తాం

ప్రజాశక్తి- పలాస

మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మీ పాలనలో ఏడో వార్డులో పలు కబ్జాలు, అక్రమ నిర్మాణాలు జరిగాయని, వాటిని తొలిగించేందుకు రావాలని తెలుగు తమ్ముళ్లు సవాల్ విసిరారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో పలు ప్రాంతాల్లో ఆక్రమించుకున్న భూములను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ టిడిపి అధ్యక్షులు బడ్డ నాగరాజు మాట్లాడుతూ 7వ వార్డులో సర్వే నంబరు 136-1, 50 ఎకరాల విస్తీర్ణంలోని ఉదయసాగరం చెరువు వైసిపి నాయకులు కబ్జాలు చేసి దానిలో వెంచరు, అక్రమ భవన నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. అదేవిధంగా పాత జాతీయ రహదారి పక్కన అమర్ డైట్ కళాశాల వద్ద రహదారి ఆక్రమణకు గురైందని, పెసరపాడుకు వెళ్లే మార్గంలో మూడు అంతస్తుల అక్రమ భవణాలు చేపట్టారని అన్నారు. రైల్వే ట్రాకుకు అనుకొని ఉన్న 15 ఎకరాల బనియబంద చెరువు ఆక్రమణలకు గురైందని అన్నారు. వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఈయనతో పాటు ఆర్.మన్మథరావు. కె.చిన్నారావు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపిపి వసంతస్వామి

సమన్వయంతో సాగాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గ్రామస్థాయిలో టిడిపి నాయకులు ప్రతి కార్యకర్తనీ కలుపుకుపోవాలని మాజీ ఎంపిపి గోరకల వసంతరావు అన్నారు. టిడిపి కార్యాలయంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు సురాడ మోహనరావు అధ్యక్షతన కార్యకర్తలతో గురువారం మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రావడానికి కార్యకర్తలు ఎంతో శ్రమించారని, వారికి పార్టీ నాయకులు అండ ఎప్పుడూ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పుచ్చ ఈశ్వరరావు, కణితి సురేష్, అరసవల్లి ఉమామహేశ్వరరావు, గోవింద పాపారావు, శూల చిట్టిబాబు, కర్నీ రమణ, అంబటి రామకృష్ణ, అట్టాడ రఘు, అఖిల్, భీమారావు, చాణక్య, శివ, రామకృష్ణ పాల్గొన్నారు.

అతిసార వ్యాప్తిని అరికడదాం

పోలాకి: అతిసార వ్యాప్తిని అరికడదామని పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణ అధికారి డాక్టర్ నల్లి రవికుమార్ అన్నారు. ఐడిసిఎఫ్- ఇంటెన్సిఫైడ్ డయేరియల్ కంట్రోల్ ఫార్టినైట్‌లో భాగంగా గంగివలసలోని కెజిబివి స్టాఫ్ డయేరియా క్యాంపెయిన్ గురువారం నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలు కలిగిన ప్రతి ఇంటికీ రెండు ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రతి బిడ్డ, తల్లికి అతిసార నివారణ, ఒఆర్ఎస్‌పై అవగాహన కలిగిస్తున్నామని అన్నారు. తగు మోతాదులో జింక్ మాత్రలు అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు మంగం శేఖర్‌బాబు, బరాటం లక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ శారద, విజయలక్ష్మి, వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న రాజేష్

పుస్తకాల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వం బాలికల విద్యను ప్రోత్సహిస్తుందని 17వ డివిజన్ ఇన్‌ఛార్జి బస్వా రాజేష్ రెడ్డి అన్నారు. నగరంలోని చేపల వీధి నగరపాలకోన్నత బాలికల పాఠశాలలో గురువారం నిర్వహించిన విద్యార్థుల కిట్ల పంపిణీ కార్యక్రమంలో రాజేష్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సాహించాలన్న ఉద్దేశ్యంతో పంపిణీ చేసిన కిట్లను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించాలన్నారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ సహకారంతో పాఠశాలో మరిన్ని మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తానన్నారు. అనంతరం విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం డి.లక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది, కమిటీ సభ్యులు ఇప్పిలి బాబు, శివరామరాజు, కరాటే శివ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.